జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 63 15-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు (జాతీయ దిన పత్రిక, మన భాష.. మన పత్రిక..)

www.epaper.tholivelugu.com


Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

# ఖర్గ్ ఐలాండ్‌పై భీకర దాడి

- 90 సైనిక లక్ష్యాలపై బాంబుల వర్షం
- ఇరాన్ మౌలిక వ్యవస్థలన్నీ ధ్వంసం: అమెరికా
- త్వరలో భూతల దాడుల దిశగా యోచన!
- గల్ఫ్‌కు మరిన్ని యుద్ధ నౌకల తరలింపు
- హుటాహుటిన 2,500 మంది సైనికులు
- గల్ఫ్ చమురు వ్యవస్థలపై ఇరాన్ దాడులు
- యూఏఈలోని చమురు క్షేత్రంలో మంటలు
- పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్రం

వాషింగ్టన్: పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్ర రూపు దాలుస్తోంది. ఇరాన్‌కు ఆర్థిక ఆయువుపట్టు వంటి ఖర్గ్ దీవిపై అమెరికా దాడులు, ప్రతీకారంగా పలు గల్ఫ్ దేశాల్లోని చమురు వ్యవస్థలపై ఇరాన్ తీవ్రస్థాయి ప్రతిదాడులతో శనివారం పోరు కీలక మలుపు తిరిగింది. ఆ దేశాల్లోని అమెరికా స్థావరాలనే గాక ఆ దేశంతో సంబంధమున్న చమురు వ్యవస్థలన్నింటినీ ఇకపై లక్ష్యం చేసుకుంటామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. తమపై అమెరికా దాడులకు ఉపయోగపడుతున్న గల్ఫ్ నగరాలన్నింటిపైనా ప్రతీకార దాడులు తప్పవని హెచ్చరించింది.

- మిగతా 2వ పేజీలో





## హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో డబుల్ డెక్కర్ కారిడార్..

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన మంత్రి..
- హైదరాబాద్ నుంచి విజయవాడ మార్గంలో త్వరలోనే 10 లైన్ల రహదారి విస్తరణ..

2లో

## కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు బండి సంజయ్ పాదయాత్ర

- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసింది శూన్యం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- కరీంనగర్ నుంచి కొండగట్టుకు అంజన్న ఆశీర్వాద యాత్ర



2లో

## వాంగ్‌చుక్ విడుదల

- కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఆరునెలల నిర్బంధం తర్వాత
- విడుదలైన పర్యావరణ ఉద్యమనేత
- స్వాగతించిన ప్రతిపక్షాలు

2లో



# మాది పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం




- గతంలో సమస్యలు చెప్పుకోవడానికే జనం భయపడేవారు
- నేడు ప్రభుత్వ యంత్రాంగమే మీ వద్దకు వస్తోంది
- ఏడాదిన్నరలో గిరిజన ప్రాంతంలో 460 కిమీ రోడ్లు వేశాం
- కష్టపడే ప్రభుత్వానికి అండగా ఉంటే మరింత బాగా పనిచేస్తాం
- మీరు రోడ్డుపైకి రాక ముందే వాటి పరిష్కారానికి సిద్ధం: పవన్
- అల్లూరి జిల్లా మారుమూల పల్లెలో జనసేన ఆవిర్భావ దినోత్సవం

తమది 'పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం' అని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామం నందిగరువులో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో 'మాట-మంతి' కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "గత ప్రభుత్వంలో కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కూడా ప్రజలు భయపడేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగమే మీ గడప వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకునేలా

- మిగతా 2వ పేజీలో

## తెలంగాణలో వంటగ్యాస్ కొరత లేదు

- గ్యాస్ కొరతపై మంత్రి స్పష్టత
- గృహ వినియోగదారులకు సరిపడా సిలిండర్లు
- కమర్షియల్ గ్యాస్ కొరతకు కేంద్ర గైడ్‌లైన్స్ కారణం
- అక్రమ నిల్వలపై ప్రత్యేక కమిటీల ఏర్పాటు



2లో

## గ్యాస్‌పై ప్రజలు ఆందోళన చెందొద్దు

- కొరత సమస్య లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు
- మంత్రుల బృందం, ప్రత్యేక అధికారుల బృందాలు నిరంతర పర్యవేక్షణ
- కష్టం, నష్టాన్ని తగ్గించేందుకు ముమ్మర ప్రయత్నాలు
- వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్ర మంత్రులు కేశవ్, అచ్చెన్నాయుడు, మనోహర్

2లో





## వేలమంది ఇళ్లు కూల్చి వాటి పునాదులపై మూసీ ప్రణాళిక అంటే ఒప్పుకోం

- మేము ఒక్క ఇంటినీ కూల్చకుండా 6 కి.మీ. అభివృద్ధి చేశాం
- మూసీకి వ్యతిరేకం కాదు.. జరిగే అవినీతి, ఇళ్ల కూల్చివేతను అడ్డుకుంటాం
- 'మూసీపవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్'లో కేటీఆర్

2లో

## బెంగాల్‌లో జంగిల్ రాజ్ అంతం కాక తప్పదు

- రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ఒక నిర్ణయాత్మక పోరాటం
- కోల్‌కతా బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- చొరబాటుదార్ల ఓట్లను తొలగిస్తే తప్పేమిటని ప్రశ్న



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో చొరబాటుదార్లను కాపాడేందుకే తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. చొరబాటుదార్ల కారణంగా రాష్ట్రంలో చాలాప్రాంతాల్లో జనాభా

- మిగతా 2వ పేజీలో

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


# హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో డబుల్ డెక్కర్ కారిడార్..

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఎప్పుడూ రద్దీగా ఉండే ఎల్బీనగర్, హయత్ నగర్ ప్రాంతాల రూపురేఖలు మార్చేలా రాష్ట్ర ప్రభుత్వం భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రహదారుల విస్తరణ, అత్యాధునిక రవాణా వ్యవస్థల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో హయత్ నగర్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమ విశేషాలు , మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించిన కీలక అంశాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శనివారం హయత్ నగర్ ప్రాంతంలో పర్యటించారు. తొర్రూర్ ఎక్స్ రోడ్ (సాయిబాబా ఆలయం) నుంచి జీ స్కూల్ వరకు ఉన్న రహదారిని ప్రస్తుతం ఉన్న 2-లేన్ల నుంచి 4-లేన్ల రహదారిగా విస్తరించే పనులకు ఆయన భూమి పూజ చేశారు. సుమారు 10 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు వల్ల స్థానిక వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఈ కార్యక్రమంలో రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు బండి సంజయ్ పాదయాత్ర

కరీంనగర్: కొండగట్టు అభివృద్ధికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసింది శూన్యమని.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే సర్కారు నిధులతోనే కొండగట్టు అభివృద్ధి జరుగుతోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అందిస్తే పార్టీ ప్రజాప్రతినిధులందరితో కలిసి కొండగట్టు అంజన్న సన్నిధికి కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకుంటానని ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఉదయం 7గంటలకు కరీంనగర్‌లోని మహాశక్తి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి 'అంజన్న ఆశీర్వాద యాత్ర'ను ప్రారంభించారు. కొత్తగా ఎన్నికైన బీజేపీ సర్పంచులు 108 మంది, 450 మంది వార్డు సభ్యులు, 54 కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మేయర్, డిప్యూటీ మేయర్‌తో కలిసి వేలాది మంది కాషాయ శ్రేణులతో కాలి నడకన జగిత్యాల జిల్లాలోని కొండగట్టు వరకు 40 కిలో మీటర్ల మేర యాత్ర సాగింది. రాత్రి 10.30 గంటలకు ముగిసింది. అప్పటికే సమయం మించిపోవడంతో గర్భాలయం మూసివేశారు. ఆలయ ద్వారం వద్దనే బండి సంజయ్ మొక్కు చెల్లించుకున్నారు. పాదయాత్రను కొనసాగిస్తూనే మార్గమధ్యంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ప్రసాదం స్కీం కింద కొండగట్టు, వేములవాడ, ఇల్లంతకుంట ఆలయాలను టెంపుల్ కారిడార్‌గా చేయాలని ప్రయత్నించానని, అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించలేదని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆలయాలను అభివృద్ధి చేయలేదని, తాము చేయడానికి ముందుకు వస్తే చేయనివ్వలేదన్నారు

# తెలంగాణలో వంటగ్యాస్ కొరత లేదు

తెలంగాణలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, కేవలం కమర్షియల్ సిలిండర్ల విషయంలోనే కొంత కొరత ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ , ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.3 కోట్ల మంది యాక్టివ్ గృహ వినియోగదారులు ఉన్నారని, వారికి సరిపడా సిలిండర్లను ఆయిల్ కంపెనీలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. గతంలో రోజుకు సగటున 2.15 లక్షల సిలిండర్లు సరఫరా అయ్యేవని, ప్రస్తుత డిమాండ్‌ను బట్టి దానిని 2.3 లక్షలకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. గ్యాస్ కొరత ఉందన్న ఆందోళనతో వినియోగదారులు అనవసరంగా ఓవర్ బుకింగ్ చేసి సిస్టమ్‌ను ఓవర్‌లోడ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు వాడే 19 కేజీల కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం తగ్గుదల ఉన్న మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కొత్త మార్గదర్శకాల వల్ల గతంలో ఉన్న సరఫరాలో కేవలం 20 శాతం మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉందని ఆయన వివరించారు. గతంలో రోజుకు 23,000 కమర్షియల్ సిలిండర్లు సరఫరా అయ్యే చోట, ఇప్పుడు కేవలం 6,200 మాత్రమే వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని ఆయన హామీ ఇచ్చారు.

# గ్యాస్‌పై ప్రజలు ఆందోళన చెందొద్దు

విజయవాడ::రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, మంత్రుల బృందం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం కానూరులోని పౌర సరఫరాల రాష్ట్ర కార్యాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, వర్చువల్‌గా నాదెండ్ల మనోహర్.. పౌర సరఫరాలు, సమాచార, పౌర సంబంధాలు, పోలీస్, విజిలెన్స్ తదితర సమన్వయ శాఖల అధికారులతో పాటు ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తదితర ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌పీజీ రోజువారీ అవసరాలు, సరఫరా స్థితిగతులతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. రియల్ టైమ్ డేటా విశ్లేషణ ఆధారంగా పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గౌరవ ప్రధాని నేతృత్వంలో కేంద్రం, గౌరవ సీఎం నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రుల బృందంతో పాటు అధికారుల బృందాలు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తూ భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. వదంతులు నమ్మవద్దని కోరారు.

# వేలమంది ఇళ్లు కూల్చి వాటి పునాదులపై మూసీ ప్రణాళిక అంటే ఒప్పుకోం

బండ్లగూడ: గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.16వేల కోట్లతో ఒక్క ఇల్లూ కూల్చకుండా మూసీని అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. ఇప్పటికే ఉప్పల్, నాగోల్ ప్రాంతాల్లో 6 కి.మీ. మేర విజయవంతంగా అభివృద్ధి చేశామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.లక్షన్నర కోట్ల అంచనాలతో సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ విధ్వంసానికి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. శనివారం హిమాయత్ సాగర్ వేదికగా 'మూసీ పునరుజ్జీవం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్'కార్యక్రమాన్ని కేటీఆర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ప్లానింగ్ రిపోర్టు లేకుండా సోషల్ ఇంపాక్ట్ స్టడీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ స్టడీ వంటి నివేదికలు లేకుండా, ప్రజలతో చర్చలు నిర్వహించకుండా వేలాదిమంది ఇళ్లను కూలగొడతామని కాంగ్రెస్ ప్రభుత్వం భయాందోళనకు గురిచేస్తోందని మండిపడ్డారు. 'అభివృద్ధికి మేము ఏమాత్రం వ్యతిరేకం కాదు. అవినీతికి, కాంగ్రెస్ భూదాహానికి, రేవంత్ రెడ్డి లక్షల కోట్ల అవినీతి ప్రణాళికలకు మాత్రం వ్యతిరేకం. రేవంత్ రెడ్డి అవినీతిని అడ్డుకుంటాం. పార్టీలకు అతీతంగా హైదరాబాద్ నగర ప్రజలను కాపాడుకుంటాం. బాధితుల వెంట బీఆర్ఎస్ ఉంటుంది'అని కేటీఆర్ చెప్పారు. రెండేళ్లపాటు మూసీ బాధితులు సమష్టిగా ప్రభుత్వంపై పోరాడితే, తమ ప్రభుత్వం వచ్చాక కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యాన్ని పారదోలి అందరి ఇళ్లు, భూములను కాపాడతామని హామీ ఇచ్చారు.

### ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవన్నారు..

ఇచ్చిన హామీలకు, అభివృద్ధికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని, విపరీతంగా అప్పులు ఉన్నాయని చెబుతున్న రేవంత్ రెడ్డి.. మూసీ కోసం వేల కోట్లు ఖర్చు పెడతానంటున్నాడని కేటీఆర్ ఎద్దేవాచేశారు. 'రూ.లక్షన్నర కోట్లతో మూసీని అభివృద్ధి చేస్తామంటున్నారు... అందాల పోటీలకు, ఫుట్‌బాల్ ఆటలకు వందల కోట్లు ఖర్చు పెడుతూ, మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనె లెక్క రేవంత్ తీరు తయారైంది. గత ప్రభుత్వంలో కేసీఆర్ పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా నదుల నీటి వినియోగం, ప్రాజెక్టుల నిర్మాణం గురించి వివరిస్తే, రేవంత్ రెడ్డి పీపీటీ ద్వారా ఎవరి ఇల్లు ఎట్లా కూలగొట్టాలి, ఎవరి భూములు ఎట్లా లాక్కోవాలి అనే విధ్వంసం గురించి పీపీటీ ఇచ్చాడు'అని విమర్శించారు.

### రూ.లక్షన్నర కోట్లు ఎందుకు?

నిజాం కట్టించిన అద్భుతమైన జంట జలాశయాలను ఖరాబ్ చేసింది కాంగ్రెస్ పార్టీయేనని, దశాబ్దాలపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల పాలన ఫలితంగానే మూసీ సర్వనాశనమైందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మూసీని మురికి కుప్పగా మార్చిన



పాపానికి రేవంత్‌రెడ్డి ముక్కు నేలకి రాసి, ప్రజలకు క్షమాపణ చెప్పి పాపాన్ని కడుక్కోవాలని హితవు పలికారు. వందల కిలోమీటర్ల నమామి గంగే పథకానికి కేవలం రూ.42 వేల కోట్లు వ్యయమైతే, 55 కి.మీ. మూసీకి రూ.లక్షన్నర కోట్లు ఎందుకు ఖర్చవుతుందో రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రాన్ని, ఈ నగరాన్ని ప్రేమించే పార్టీగా, వ్యక్తులుగా మూసీ అభివృద్ధిని ఏమాత్రం అడ్డుకోబోమన్నారు. మూసీ పేరుతో రూ.వేల కోట్ల సొమ్మును దోచుకుంటామంటే మాత్రం కచ్చితంగా అడ్డుకుంటామని చెప్పారు.

# బెంగాల్‌లో జంగిల్ రాజ్ అంతం కాక తప్పదు

(మొదటి పేజీ తరువాయి)



సమతూకంలో విపరీతమైన మార్పులు వచ్చాయని ఆందోళన వ్యక్తంచేశారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగానే బెంగాలీ హిందువులను మైనార్టీ లుగా మార్చేసిందని దుయ్యబట్టారు.ద ఎన్నికల్లో లబ్ధి కోసం చొరబాట్లను ప్రోత్సహించిందని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ శనివారం పశ్చిమ బెంగాల్‌లో పర్యటించారు. రూ.18,680 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. రెండు రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఓడరేవుల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కోల్‌కతాలో బహిరంగ సభకు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నిర్వహించిన పరివర్తన్ యాత్ర ముగింపు సందర్భంగా ఈ సభ నిర్వహించారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మమతా బెనర్జీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన సంస్థలపై దాడి చేసిందని ఆరోపించారు. ఈ అరాచక ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని అన్నారు. రాజకీయ మార్పు తీసుకురావాలని ప్రజలకు సూచించారు బెంగాల్ ఆత్మను కాపాడేందుకు, కట్ మనీ సంస్కృతిని అంతం చేసేందుకు, భయం నుంచి విముక్తి కోసం ఈ ఎన్నికలు జరగబోతున్నాయని స్పష్టంచేశారు. రాష్ట్ర భవిష్యత్తు విషయంలో ఈ ఎన్నికలు నిర్ణయాత్మక పోరాటమని అభివర్ణించారు. బెంగాల్‌లో జంగిల్ రాజ్ అంతం కాక తప్పదన్నారు. ఎస్ఐఆర్‌తో ఓటర్ల జాబితా నుంచి చొరబాటుదార్ల పేర్లుతొలగిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. మృతి చెందినవారి పేర్లు కూడా తొలగించకూడదా? అని నిలదీశారు. తృణమూల్ కాంగ్రెస్ గూండాలు ఇన్నాళ్లూ ప్రజలను భయపెట్టారని, ఇక ఆ గూండాలే భయపడే రోజులు వచ్చాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. నేరగాళ్లు, చొరబాటుదార్లు, బుజ్జగింపు రాజకీయాలు చేసేవాళ్లు చట్టానికి భయపడాల్సిందేనని ఉద్ఘాటించారు. నేరగాళ్లు ఉండాల్సిన చోటు జైలు మాత్రమేనని వ్యాఖ్యానించారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి రాగానే వారిని జైలుకు పంపిస్తామన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవారిపై, హింసకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలన వచ్చే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినవారిని, అరాచకాలకు పాల్పడినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తీవ్రంగా హెచ్చరించారు.

# మాది పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

పాలనను ప్రక్షాళన చేశాం. మీరు కష్టాలు చెప్పుకోవడానికి రోడ్ల మీదకు రాకముందే వాటిని పరిష్కరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం నిధులు మళ్లించడం వల్లే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని పవన్ కల్యాణ్ ఆరోపించారు. "జలజీవన్ మిషన్ పథకంలో రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఏజెన్సీ గ్రామాల్లో 460 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాం. గిరి శిఖర గ్రామాల్లో గర్భిణీలు పడుతున్న డోలీ కష్టాలు ఇక కనిపించకూడదన్నదే మా లక్ష్యం" అని వివరించారు. కేవలం 40 గడపలున్న నందిగరువు గ్రామానికి రూ.2 కోట్లతో రోడ్డు నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని లక్షలాది మంది మధ్య కాకుండా, 70 ఏళ్లుగా రోడ్డుకు నోచుకోని మారుమూల గిరిజన గ్రామంలో జరుపుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పవన్ అన్నారు. "ఈ ప్రాంతంలో కూటమి అభ్యర్థులు గెలవకపోయినా మేము ఎక్కడా వివక్ష చూపించం. మీరు ఓట్లు వేశారా లేదా అని చూడకుండా, మీరు బాగుండాలనే పనిచేస్తాం. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ఇలాంటి ప్రాంతాలకు రావడానికి నాయకులు భయపడతారేమో కానీ, ప్రజల కోసం పనిచేసే నాకు ఎలాంటి భయాలు లేవు" అని స్పష్టం చేశారు.

# వాంగ్‌చుక్ విడుదల

జోద్‌పూర్: లద్దాఖ్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా కల్పించాలని, ఆ ప్రాంతాన్ని రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ పరిధిలో చేర్చాలని ఉద్యమించి చివరకు జైలుపాలైన పర్యావరణ ఉద్యమకారుడు, సామాజికవేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఎట్టకేలకు స్వేచ్ఛా వాయువులు పీల్చారు. గత ఆరునెలలుగా కారాగారానికే పరిమితమైన వాంగ్‌చుక్‌పై కొనసాగుతున్న నిర్బంధాన్ని తక్షణం రద్దుచేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం శనివారం కీలక ప్రకటన విడుదలచేసింది. తక్షణం ఆయనను విడుదలచేస్తున్నట్లు వెల్లడించింది. వెనువెంటనే ఆయనను జోధ్‌పూర్ కేంద్ర కారాగారం నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు విడుదలచేశారు. భర్త విడుదల కోసం కొంతకాలంగా న్యాయస్థానాల్లో పోరాడుతున్న గీతాంజలి ఆంగ్మో జోధ్‌పూర్ కేంద్ర కారాగారానికి వచ్చి ఆయనను వెంట తీసుకెళ్లారు. వాంగ్‌చుక్‌ను అరెస్టును సవాల్‌చేస్తూ భార్య వేసి న పిటిషన్ మార్చి 17వ తేదీన సుప్రీంకోర్టులో తదుపరి విచారణకు రాబోతున్న వేళ కేంద్రం ఆయనను విడుదలచేయడం గమనార్హం.

# ఖర్గ్ ఐలాండ్‌పై భీకర దాడి

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా సేనలు మోహరించిన ప్రదేశాల నుంచి పౌరులంతా తక్షణం వెళ్లిపోవాలని సూచించింది! మరోవైపు ఖర్గ్‌పై భూతల దాడులకు కూడా అమెరికా రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు చెబుతున్నారు. 2,500 మందితో కూడిన నావికా దళాన్ని, మరిన్ని ఆంఫీబియస్ యుద్ధ నౌకలను హుటాహుటిన గల్ఫ్‌కు తరలిస్తుండటం ఇందుకు బలం చేకూరుస్తోంది. వీటికి తోడు ఇరాన్‌తో యుద్ధం నిర్ణాయక దశలోకి ప్రవేశించిందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో యుద్ధ పరిధి మరింతగా విస్తరించడం ఖాయమని, తద్వారా మరింత జనహననం, ఆస్తి నష్టం తప్పవని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ చమురు నెట్‌వర్క్‌కు జీవనాడి వంటి ఖర్గ్ దీవిపై అమెరికా భారీ స్థాయిలో దాడులకు దిగింది. అక్కడ పదులకొద్దీ సంఖ్యలో భారీ పేలుళ్లు విన్పించాయి. సముద్రంలో అమర్చే మందుపాతరల నిల్వ కేంద్రం, క్షిపణి నిల్వ కేంద్రం, బంకర్లతో పాటు మొత్తం 90కి పైగా సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసినట్టు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. దీవిలోని కీలకమైన సైనిక స్థావరాలను పూర్తిస్థాయిలో ధ్వంసం చేసినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే కీలకమైన చమురు వ్యవస్థల జోలికి మాత్రం పోలేదని తెలిపారు. హోర్మూజ్ గుండా నౌకల ప్రయాణాన్ని ఇరాన్ నిరోధిస్తే వాటిని కూడా తుడిచి పెట్టేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు చేశారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ఆయన పోస్టులు చేశారు. జపాన్ నుంచి తక్షణం పశ్చిమాసియాకు తరలాలంటూ 31వ మరీన్ ఎక్స్‌పెడిషనరీ యూనిట్, యాంఫిబియస్ షిప్ యూఎస్ఎస్ ట్రిపోలీకి ఆదేశాలు జారీ అయ్యాయి. యూఎస్ఎస్ అబ్రహంలింకన్‌తో పాటు అమెరికా ఇప్పటికే 12 యుద్ధ నౌకలను, 8 డిస్ట్రాయర్లను గల్ఫ్‌లో మోహరించింది. అమెరికా దాడిలో ఖర్గ్‌లోని తమ చమురు వ్యవస్థలకు ఎలాంటి నష్టమూ వాటిల్లలేదని ఇరాన్ పేర్కొంది. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, నావల్ బేస్, విమానాశ్రయ కంట్రోల్ టవర్, ఒక చమురు కంపెనీ తాలూకు హెలికాప్టర్ హ్యాంగర్‌పై దాడులు జరిగినట్టు తెలిపింది. శనివారం ఇరాన్‌లో 200 పై చిలుకు లక్ష్యాలను తుడిచిపెట్టినట్టు ఇజ్రాయెల్ పేర్కొంది. వాటిలో క్షిపణి కేంద్రాలు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, ఆయుధ తయారీ కేంద్రాలున్నట్టు తెలిపింది. అయితే ఖర్గ్ నుంచి చమురు ఎగుమతులు నిర్నిరోధంగా కొనసాగుతున్నట్టు వెల్లడించింది. లెబనాన్‌పైనా ఇజ్రాయెల్ దాడుల తీవ్రత కొనసాగుతూనే ఉంది. బీరూట్, శివార్లపై ఇజ్రాయెల్ సైన్యం క్షిపణులతో విరుచుకుపడింది. దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా 826 మందికి పైగా మరణించినట్టు ప్రభుత్వం పేర్కొంది. వారిలో 31 మంది వైద్య సిబ్బందేనని తెలిపింది. దాడుల తీవ్రతకు ఐదు ఆస్పత్రులను మూసేయాల్సి వచ్చినట్టు వివరించింది. దేశవ్యాప్తంగా 8.5 లక్షల మందికి పైగా నిర్వాసితులయ్యారు. ఇరాన్ నూతన సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ జాడ తెలిపిన వారికి కోటి డాలర్ల (రూ.92.5 కోట్ల) రివార్డును అమెరికా ప్రకటించింది. విదేశాంగ శాఖ ఎక్స్‌లో ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. ఖమేనీతో పాటు ఆయన కార్యాలయ చీఫ్ అలీ హస్గర్ హెజాజీ, భద్రతా విభాగం ఉన్నతాధికారి అల లరిజానీ తదితరుల పేర్లను కూడా పేర్కొంది.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## ముస్లిం కుటుంబాలకు 'రంజాన్ తోఫా' పంపిణీ

- బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాల అందజేత

**రాజపేట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రాజాపేట మండలంలోని ముస్లిం కుటుంబాలకు బీర్ల ఫౌండేషన్ అండగా నిలిచింది. మండల పరిధిలోని పాముకుంట మధిర గ్రామమైన కాష గూడెంలో శనివారం నిరుపేద ముస్లిం కుటుంబాలకు 'రంజాన్ తోఫా' (నిత్యావసర వస్తువుల కిట్లు) పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన బీర్ల ఫౌండేషన్ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. పండుగ వేళ ముస్లిం సోదరులు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ తోఫాలను అందజేస్తున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో బీర్ల ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగె పెంటయ్య గౌడ్, గ్రామ సర్పంచి మరియు సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగ నరేష్ గౌడ్, ఉపసర్పంచ్ షరీఫ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని పాండు, రాజాపేట గ్రామ ఉపసర్పంచ్ నమిల కేదారి గౌడ్, నాయకులు రంగా పాండు, కుల పెద్దలు ఎండీ మద్దుమ్ కరీం తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టులో పోరాడిన న్యాయవాదికి రాజపేట ఉద్యమకారుల కృతజ్ఞతలు

- ఇంటి స్థలాలు, పెన్షన్ తీర్పుపై హర్షం..
- కరుణాకర్ రెడ్డిని కలిసిన మారోజు, పెంట సత్యనారాయణ



**హైదరాబాద్/రాజపేట, మార్చి మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సంక్షేమం దృష్ట్యా హైకోర్టులో కీలక తీర్పు సాధించిన న్యాయవాది, తెలంగాణ ప్రైవేటు ఉద్యోగ సంఘం రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. కరుణాకర్ రెడ్డిని రాజపేట మండల ఉద్యమకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో జరిగిన ఈ భేటీలో రాజపేట మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్ష, ఉపాధ్యక్షులు మారోజు కుమారస్వామి, పెంట సత్యనారాయణ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం మరియు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ కరుణాకర్ రెడ్డి హైకోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించారని, ఈ క్రమంలో గౌరవ న్యాయమూర్తి సానుకూల తీర్పు ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఈ విజయం ఉద్యమ కారులందరికీ కొండంత అండగా నిలుస్తుందని ఆకాంక్షించారు.

## విశ్వకర్మ యోజన పథకం ద్వారా కుమ్మరి సారి కిట్ అందజేత



**రాజపేట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద రాజపేట గ్రామానికి చెందిన నాగపూరి ప్రవీణ్‌కు విద్యుత్తుతో నడిచే కుమ్మరి సారి కిట్‌ను శనివారం అందజేశారు. స్థానిక సర్పంచ్ కోయ మధు ఈ కిట్‌ను లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోయ మధు మాట్లాడుతూ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో విశ్వకర్మ యోజన పథకం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. యువత ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని, అలాగే ముద్ర లోన్లను కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు సాధనబోయిన శెంకర్, నాయకులు చెలమలపల్లి లక్ష్మణ్, చిగుళ్ల బీరయ్య, మేక సిద్దులు, దొంతి రమేష్, సాధనబోయిన విఘ్నేష్, మొహ్మద్ కాజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

**14 (తొలివెలుగు న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 14 శనివారం నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో చౌటుప్పల్ లోని పలు పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొన్నది. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహించారు. అరగంట ముందుగానే పరీక్ష కేంద్రంలోని విద్యార్థులను పంపించారు. పరీక్ష కేంద్రాలలో అధికారులు మౌలిక వసతులు విద్యార్థులకు ఏర్పాటు చేశారు. అలాగే పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. పదో తరగతి పరీక్షలు మొదటి రోజు కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బోర్డుపై విద్యార్థులు తమ హాల్ టికెట్ నెంబర్లను చూసుకున్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అధికారులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపిస్తున్నారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాలలో నీరు, విద్యుత్ సౌకర్యాలు, విద్యార్థులు ఎవరైనా అస్వస్థకు గురైతే తక్షణమే చికిత్స అందించేందుకు ప్రతి ఎగ్జామ్స్ సెంటర్లో వైద్య సదుపాయాలను విద్యార్థుల కోసం




అధికారులు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు పేర్కొన్నారు. చౌటుప్పల్ మండల విద్యాధికారి తెలిపిన వివరాలు ప్రకారం.. పదో తరగతి పరీక్షల నిర్వహించేందుకు మొత్తం ఏడు సెంటర్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో జడ్.పి.హెచ్.ఎస్ చౌటుప్పల్, మల్లికార్జున హై స్కూల్, జడ్.పి.హెచ్.ఎస్ తంగడపల్లి, అన్న మెమోరియల్ హై స్కూల్, సాన్ జాన్



హై స్కూల్, కృష్ణవేణి హై స్కూల్, లక్కారం ఆదర్శ పాఠశాల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 1275 విద్యార్థులకు గాను 1272 విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ముగ్గురు విద్యార్థులు గైరిహాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అన్ని పరీక్ష కేంద్రాలలో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

## స్వామివారిని దర్శించుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



**యాదగిరిగుట్ట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శనివారం జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూలమాలతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణకు వేదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మాధవాచార్యులు, శ్రీనాథాచార్యులు, వేద పండితులు, అధికారులు సీతారామాచార్యులు పాల్గొన్నారు.

## వైకల్యాన్ని జయించి.. పదో తరగతి పరీక్షకు!

- స్క్రైబ్ సాయంతో పరీక్ష రాసిన అజయ్..
- ఎంఈఓ రమేష్, హెచ్ఎం కోటిరెడ్డి ప్రోత్సాహంతో పరీక్షలకు హాజరు



**రాజపేట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండలం కుర్రారం గ్రామానికి చెందిన శ్రీరాముల అజయ్ స్క్రైబ్ సాయంతో ఎస్ఎస్సీ పరీక్షలకు హాజరవుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మానసిక వైకల్యం ఉన్న అజయ్‌కు అదే గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి పిడుగు నవదీప్ స్క్రైబ్‌గా సహాయం చేస్తున్నాడు. శనివారం మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు అజయ్ హాజరయ్యాడు. కుర్రారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డి ప్రోత్సాహం, మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ సహకారంతో స్క్రైబ్ ద్వారా పరీక్షలు రాయడానికి అవకాశం లభించింది. ఇందుకోసం సంబంధిత ధ్రువీకరణ పత్రాలను డీజీఈ (డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్) కార్యాలయానికి పంపించి అనుమతి పొందారు. అనుమతి లభించడంతో అజయ్ ఎస్ఎస్సీ పరీక్షలకు పిడుగు నవదీప్ సహాయంతో హాజరవుతున్నాడు.



మొదటి రోజు పరీక్ష అనంతరం వారిద్దరిని ప్రశ్నించగా తెలుగు పరీక్షను బాగా రాసినట్లు తెలిపారు. కుర్రారం ఉన్నత పాఠశాల నుండి మొత్తం తొమ్మిది మంది విద్యార్థులు ఈసారి ఎస్ఎస్సీ పరీక్షలకు హాజరవుతుండగా, అందులో నలుగురు అమ్మాయిలు, ఐదుగురు అబ్బాయిలు ఉన్నట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. గత సంవత్సరం పాముకుంట ఉన్నత పాఠశాల నుండి కూడా ఎంఈఓ చందా రమేష్ సహకారంతో ఒక విద్యార్థి స్క్రైబ్ సాయంతో పరీక్ష రాసి మంచి మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో కుర్రారం గ్రామానికి చెందిన అజయ్ స్క్రైబ్ సాయంతో పరీక్షలు రాస్తుండటం విశేషంగా నిలిచింది.

## గ్రామీణ నూతన ఆవిష్కరణ లను ప్రోత్సహించాలి

**ఆదిలాబాద్ (తొలివెలుగు న్యూస్):** మారుమూల గ్రామాల నుంచి వెలువడుతున్న సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం అం దించి వాటిని పారిశ్రామిక స్థా యికి తీసుకెళ్లడమే లక్ష్యంగా తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించి న 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని జిల్లా క లెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కా ర్యక్రమంలో ఆదిలాబాద్, ఆసి ఫాబాద్ జిల్లాలకు చెందిన సు మారు 40 మందికి పైగా యు వ ఆవిష్కర్తలు, విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులు, ఆ లోచనలను ప్రదర్శించారు. ము ఖ్యంగా వ్యవసాయానికి ఉప యోగపడే పరికరాలు, పర్యా వరణహిత ఇంధన వనరులు, ఆరోగ్య రంగానికి సంబంధిం చిన వినూత్న నమూనాలు కా ర్యక్రమానికి హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ, అభివృద్ధి కేవలం మె ట్రో నగరాలకు మాత్రమే పరి మితం కాకుండా గ్రామీణ ప్రాం తాల్లోనూ ఉన్న ప్రతిభను వెలి కితీయడం అవసరమని అ న్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నూతన ఆవిష్కరణలను వెలి కితీసి వాటిని వ్యాపార మార్గా లుగా మలచడానికి యువత ముందుకు రావాలని పిలు పు నిచ్చారు. స్థానికంగా అభివృ ద్ధి చెందుతున్న స్టార్టప్‌లకు ప్రో త్సాహం అందించేందుకు ఆది లాబాద్ జిల్లాలో ప్రత్యేకంగా ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటు చే యనున్నట్లు తెలిపారు. హైద రాబాద్ నుంచి వచ్చిన నిపు ణుల బృందం ఆవిష్కర్తలతో ప్రత్యక్షంగా చర్చించి వారి ఆ లోచనలను మరింత మెరుగు పరుచుకునే విధంగా మార్గని ర్దేశం చేసింది.



## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

- కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్
- రాజపేట మండలంలో 100 శాతం హాజరు

**రాజపేట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండలంలోని ఎస్ఎస్సీ పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ వల్లపు ప్రదీప్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శరత్ యామిని బృందాలు శనివారం ఆకస్మికంగా సందర్శించి పర్యవేక్షించారు. మొదటి రోజు నిర్వహించిన తెలుగు పరీక్ష ప్రశాంత వాతావరణంలో సాగిందని అధికారులు తెలిపారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు శాతం శాతం హాజరయ్యారు. పీఎం శ్రీ రాజపేట కేంద్రంలో 188 మంది విద్యార్థులు, రాజపేట బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 152 మంది విద్యార్థులు, రఘునాథపూర్ పరీక్షా కేంద్రంలో 93 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. రాజపేట కేంద్రంలో ఇద్దరు సీడబ్ల్యూఎస విద్యార్థులకు ఈ సబ్జెక్ట్‌లో మినహాయింపు కల్పించినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ వల్లపు ప్రదీప్ మూడు పరీక్షా కేంద్రాలను పరిశీలించగా, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం కూడా మూడు కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా వారి వెంట మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ పాల్గొన్నారు. పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లుగా తద్క రాజు, కె. మనోజ్ కుమార్, జే. ప్రభాకర్ వ్యవహరించగా, డిపార్ట్‌మెంట్ అధికారులు బి. వసంత, ఎస్. విజయలక్ష్మి, బి. పరమేష్ తదితరులు విధులు నిర్వహించారు. మొదటి రోజు నిర్వహించిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

## నేడు ఉగాది కవి సమ్మేళనానికి ఆహ్వానం

**మంచిర్యాల, 14, మార్చి (తొలివెలుగు న్యూస్):** స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమం నేడు ఆదివారం (మార్చి 15) ఉదయం 10 గంటలకు మంచిర్యాల పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్, ఓవర్ బ్రిడ్జ్ సమీపంలో నిర్వహించబడుతుందని తెలిపారు. జిల్లాలోని కవులు, కవయిత్రులు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉగాది కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. అలాగే కార్యక్రమానికి హాజరయ్యే వారు సమయపాలన పాటించాలని జిల్లా సాహితీ సంరక్షణ సమితి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు.



## ఘనంగా మోటార్ వైండింగ్ షాప్ ప్రారంభోత్సవం

- పొట్టిమర్రి ఎక్స్ రోడ్డులో హారిక - హరిబాబుల నూతన వ్యాపార సంస్థ



రాజపేట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్): రాజపేట మండల పరిధిలోని పొట్టిమర్రి క్రాస్ రోడ్డు వద్ద గజం హారిక – హరిబాబు దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన మోటార్ వైండింగ్ షాప్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా షాప్ యజమానులు హారిక – హరిబాబు దంపతులను ఎంఈఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఇంజ మహేష్ మాదిగ శాలువాతో సత్కరించారు. వారికి శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపార సంస్థ విజయవంతంగా కొనసాగాలని, స్థానిక రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర నాయకుడు బుడిగే పెంటయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గ నాయకుడు ఇంజ నరేష్, సర్పంచులు భీమగాని రూప బాల నరసయ్య, నడిమింటి నరేష్, పల్లె సంతోష్ గౌడ్, నాయకులు సంగమ్ మధు, మహమ్మద్ అన్వర్, గుర్రం బాబు, గుర్రం శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి చెరువును గోదావరి జలాలతో నింపుతాం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
- తోపుగాని చెరువుకు జలహారతి..
- అలుగు పోస్తున్న గోదావరి నీరు



**యాదగిరిగుట్ట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట పట్టణంలోని తోపుగాని చెరువు గోదావరి జలాలతో నిండి అలుగు పోస్తున్న సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో ఉన్న ప్రతి చెరువు నిండేలా చేసి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలోని తోపుగాని చెరువు నిండడంతో పరిసర ప్రాంతాల చెరువులను కూడా నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. యాదగిరిగుట్ట నుంచి వంగపల్లి, రామాజీపేట, తాళ్లగూడెం వంటి 15కు పైగా గ్రామాల చెరువులను నింపి నీరు అందే విధంగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. చెరువులు నిండితే రైతులకు సాగునీరు అందడమే కాకుండా భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని ఆయన వివరించారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాణి భరత్ గౌడ్, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్, సత్యనారాయణ, భరిగె మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోజాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం “ఇగ్నైట్2026”

**మంచిర్యాల, 14, మార్చి (తొలివెలుగు న్యూస్):** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల (ఓ యు సీ ఈ ) మైనింగ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మార్చి 12, 13 లలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం “ఇగ్నైట్2026” విజయవంతంగా ముగిసింది. మైనింగ్ రంగంలో భద్రత మరియు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో విద్యార్థులు రూపొందించిన సాంకేతిక నమూనాలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డ్రోన్, ఐఓటీ, కృత్రిమ మేధస్సు (ఎఐ ), మెషిన్ లెర్నింగ్ ఆధారంగా రూపొందించిన నమూనాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్ ) అండ్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి. వెంకన్న జాధవ్, ఐఆర్‌టీఎస్ ముఖ్య అతిథిగా హాజరై మైనింగ్ రంగంలో డిజిటలైజేషన్ అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. మంగు మాట్లాడుతూ, ఇదే ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిగా చదివి, అదే కళాశాలకు ముఖ్య అతిథిగా రావడం సంస్థకు ఎంతో గర్వకారణమని అ న్నారు. బిజీ షెడ్యూల్‌లోనూ సమయం కేటాయించి తన ఆల్మా మేటర్‌ను సందర్శించి విద్యార్థులను ప్రోత్సహించినందుకు సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్న జాధవ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# థర్డ్ పార్టీ అప్లికేషన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- తెలియని అప్లికేషన్లలకు అన్ని అనుమతులను ఇవ్వరాదు
- సైబర్ నేరాలకు ఆతిథ్యమవు తున్న థర్డ్ పార్టీ అప్లికేషన్లు
- డాటా చోరీ, బ్లాక్మెయిలింగ్, మొబైల్ హ్యాకింగ్, సోషల్ మీడియా హాకింగ్ కు పాల్ప డుతున్న సైబర్ నేరగాళ్లు
- సైబర్ నేరాలకు వెంటనే 1930కు సంప్రదించాలి
- ఈవారం జిల్లాలో 14 ఫిర్యా దులు నమోదు
- జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాల ని ర్వాహణ
- ఏఐ వీడియో మెసేజెస్, సోష ల్ మీడియా ఫ్రాడ్, లోన్ ఫ్రా డ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, బిజినె స్ ఫ్రాడ్, ఫేక్ కాల్స్, బ్లాక్మెయి లింగ్, డిజిటల్ అరెస్ట్ లాంటి నూతన సైబర్ నేరాలు
- ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో “ఖాకీ కిడ్స్“ ద్వారా అవగాహ న కార్యక్రమాలు

**ఆదిలాబాద్ (తొలివెలుగు న్యూస్):** భారతదేశంలో సైబర్ నేరగా ళ్లు రోజు రోజుకు మితిమీరి అమాయకులను మోసం చే స్తున్న సందర్భంలో ప్రజలు పూర్తి అప్రమత్తతో వ్యవహ రించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియ జేశారు. అప్రమత్తతోనే, అవ గాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని జిల్లా లోని సైబర్ బృందాలచే ప్రతి పోలీస్ స్టేషన్ల వారిగా నూత నంగా ఏర్పాటు చేయబడిన “ఖాకి కిడ్స్“ అనే కార్యక్రమం లో ద్వారా పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కా ర్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం జిల్లా పోలీసు ము ఖ్య కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ సైబర్ నేరగాళ్లు మోసగిస్తున్న తీరు ప్రస్తుత సమాజంలో ప్రజలు మోసపోతున్న సందర్భాలపై వివరణను అందించారు. సై బర్ నేరానికి గురైన వెంటనే 1930కు సంప్రదించాలని, లే దా సైబర్ క్రైమ్ వెబ్సైట్ లో తమ ఫిర్యాదులను నమోదు చేయాలని తెలిపారు. ఆర్థిక నేరాలలో గోల్డెన్ హవర్ ము ఖ్యమైనదని, గంటలోపు ఫి ర్యాదు చేసిన వారి నగదు తిరి గి వచ్చే అవకాశాలు ఎక్కువ గా ఉన్నాయని తెలిపారు. స మాజంలో ముఖ్యంగా థర్డ్ పా ర్టీ అప్లికేషన్లను వినియోగిస్తూ మొబైల్ ఫోన్లో వాటికి పూర్తిగా అనుమతులను ఇవ్వడం వల్ల మొబైల్ ఫోన్ డాటా అనేది చో రీకి గురవుతుందని, దానివల్ల సామాన్య ప్రజల వ్యక్తిగత స మాచారం సైబర్ నేరగాళ్ల చేతి లోకి వెళ్లి బ్లాక్ మెయిల్ కి పా ల్పడే అవకాశం ఉన్నందున థర్డ్ పార్టీ అప్లికేషన్లు విని యో గాన్ని నిరోధించాలన్నారు. ఎ ట్టి పరిస్థితుల్లోనూ తెలియని వెబ్సైట్లను అప్లికేషన్లను ఇ న్స్టాల్ చేసుకోకుండా ఉండా లని తెలిపారు. ఈ అప్లికేషన్ల లో ముఖ్యంగా లోన్ ఆప్స్, ఏ పీ కె ఫైల్స్ ఉంటాయని తెలి పారు. అదేవిధంగా సోషల్ మీ డియా నందు జాబ్ ఫ్రాడ్, వ ర్క్ ఫ్రం హోం, ఇన్వెస్ట్మెంట్ ఫ్రా డ్, బిజినెస్ ఫ్రాడ్, ఏఐ ఆధారి త వీడియో మెసేజ్ లతో సం దేశాలతో కూడిన ఫ్రాడ్, కస్ట మర్ కేర్ ఫ్రాడ్, డిజిటల్ అరె స్ట్, లాంటివి నూతన సమా జంలో ప్రస్తుతం చలామణిలో ఉన్న నేరాలు వీటిని వల్ల అప్ర మత్తంగా ఉండాలని తెలిపా రు. తక్కువ పెట్టుబడితో ఎ క్కువ డబ్బులు వస్తాయని అత్యాశ చూపి మోసగాళ్లు అమాయకులను, యువత ను, విద్యార్థులను, నిరుద్యో గులను మోసం చేస్తుంటారని తెలిపారు. సమాజంలో అధి కారుల పేరుతో మోసం చేసే ప్రయత్నం, అధికారి పేరుతో డబ్బులు పంపాలనే ప్రయ త్నం సైబర్ నేరగాళ్లు చేస్తుం టారని బాధితులు ఎలాంటి వాటిని నమ్మకుండా నిర్భయం గా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు.



**జిల్లాలో నమోదైన పలు సైబర్ క్రైమ్ వివరాలు**

ఆదిలాబాద్ పట్టణంలోని ఒక బాధితుడి మై ఫినో బ్యాంక్ ఆప్ ద్వారా 5500 థర్డ్ పార్టీ అప్లికేషన్లను వినియోగించడం వల్ల పోగొట్టుకోవడం జరిగిం ది. ఆదిలాబాద్ రూరల్ మం డలంలోని ఒక మహిళకు ఇం స్టాగ్రామ్ లో పార్ట్ టైం జాబ్ అంటూ చిన్న మొత్తాల్లో ఇన్వె స్ట్ చేసి ఎక్కువ డబ్బులు సం పాదించవచ్చని మహిళ వద్ద నుండి 17300 రూపాయలను మోసం చేయడం జరిగింది. నాగ్నూర్ కు చెందిన మహిళ కు ఫోన్ ద్వారా మాయమాట లు చెప్పిన కేటుగాళ్లు మహిళ అకౌంట్ నుండి దాదాపు 70 వే ల రూపాయలను మోసం చే యడం జరిగింది. నేరడిగొండ కు సంబంధించిన వ్యక్తికి ఎ స్బిఐ నుండి ఫోన్ చేస్తున్నా మీ ట్రాన్సాక్షన్ లేట్ అయింది, మీ అకౌంట్ కు సంబంధించిన వివరాలు తెలియజేయగలరు అంటూ నమ్మించగా బాధితు డు వివరాలు చెప్పడంతో 50 వేల రూపాయలను మోస పోవడం జరిగింది. నేరేడిగొండ మహిళ స్క్రీన్ షేరింగ్ ద్వారా మోసగాళ్ల చేతిలో మోసపోయి దాదాపు లక్ష రూపాయ లు మోసపోవడం జరిగింది.

# జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వైద్యశాలలు

**ఖమ్మం (తొలివెలుగు న్యూస్):** ‘వైద్యో నారాయణో హరి’ అన్నారు పెద్దలు. ప్రాణం పోసే వైద్యుడే ప్రత్యక్ష దైవమనేది దానర్థం. ఇది ఒకప్పటి పాత కాలపు వైద్యులకు సరిపోయే మాట. కానీ, ప్రస్తుత కాలంలో వైద్యం పక్కా వ్యాపారంగా మారింది. మానవత్వాన్ని మరిచి, సామాజిక సేవా స్పృహను విడనాడి విజృంభించిపోయింది. ‘ఆసుపత్రిని నెలకొల్పామా! అనతికాలంలోనే కోట్లకు పడగలెత్తామా!’ అనే ఆలోచనకే అత్యధికమంది వైద్యులు మొగ్గు చూపిస్తున్నారన్నది పచ్చినిజం. ‘కడుపులో ఉబ్బరంగా, నొప్పిగా ఉందని ఓ వ్యక్తి ఖమ్మం నెహ్రూనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు. అద్దాల మేడను తలపించేలా కనిపించే అతిపెద్ద ఆసుపత్రిలో రోగం ఇట్టే నయమవుతుందని రోగి కుటుంబ సభ్యులు భావించారు. స్థానిక వైద్యులు అడిగినంత ఫీజులు చెల్లించారు. పది రోజులు గడిచిన తర్వాత వైద్యసేవల పేరుతో లక్షలాది రూపాయలు స్వాహా చేసి శవాన్ని చేతిలో పెట్టారు.’ ‘వైరల్ ఫీవర్‌తో ఒక వ్యక్తి ఖమ్మం వైరా రోడ్డులోని ఓ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మెట్లెక్కాడు. గంట తర్వాత లోపలికి పిలిచిన అక్కడి వైద్యుడు రోగితో రెండు నిమిషాలు మాట్లాడి పది రకాల టెస్ట్‌లతో కూడిన ప్రిస్క్రిప్షన్‌ని అతడి చేతిలో పెట్టాడు. సదరు ఆసుపత్రికి అనుసంధానంగా ఉన్న ల్యాబ్‌కు వెళ్లగా ఫీజు రూపంలో రూ.12 వేలు కట్టించుకున్నారు. వైద్య పరీక్షల ఫలితాలను తీసుకొని వైద్యుడి వద్దకు వెళ్లగా ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గిపోయిందని, మరింత పడిపోతే ప్రాణానికే ప్రమాదమని చెప్పాడు. వెంటనే అడ్మిట్ అవ్వాలన్నాడు. మూడు, నాలుగు రోజుల తర్వాత రూ.50 వేల వరకు బిల్లు చెల్లించి డిశ్చార్జ్ కావాలని సూచించారు.’

**ఆసుపత్రులకు అనుసంధానంగా ల్యాబ్‌లు..**

జిల్లాలోని ప్రతీ ప్రైవేట్ ఆసుపత్రికి అనుసంధానంగా క్లినికల్ ల్యాబ్‌లు, మెడికల్ షాపులను ఏర్పాటు చేసుకున్నారు. వీటిల్లో ఎక్కడా కూడా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం నిబంధనలు పాటించరు. తక్కువ వేతనాలు ఇస్తూ అర్హత లేని సిబ్బందితో మనుషుల ప్రాణాలకే లెక్కగడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, ఎక్కువ మంది సాధారణ జ్వరంతో దవాఖానకు వెళ్లినప్పటికీ స్థానిక వైద్యుడు మొదట రక్త, మూత్ర పరీక్షల ప్రిస్క్రిప్షన్‌ను చేతిలో పెడతారు.

మరికొందరైతే అవసరం లేకపోయినా స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీ వంటి పరీక్షలు చేయించుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. వాటన్నింటికీ కలిపి వందలు, వేలల్లో ఫీజులు దండుకుంటూ జేబులు నింపుకోవడం ఆనవాయితీగా మారింది. దగ్గు, జలుబు అయితే తొలుత రక్త పరీక్షలు, ఎక్స్‌రే చేయించుకోవాలి. మూడు



రోజులైనా తగ్గకపోతే స్కానింగ్ చేయించుకోవాలంటూ సూచించడం పరిపాటిగా మారింది. వైరల్ ఫీవర్స్ వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేయించి రక్తంలో ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోయాయని చెబుతున్నారు. అంతటితో ఆగకుండా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి భయంకరమైన వ్యాధులు సోకుతున్నాయని రోగులను భయభ్రాంతులకు గురిచేసి మానసికంగా ఒత్తిడి పెంచుతున్నారు. జిల్లాలో వైద్య వ్యాపారం ‘మూడు పువ్వులు ఆరు కాయలు’గా విరాజిల్లుతున్న నేపథ్యంలో ప్రైవేట్ ఆసుపత్రులు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఖమ్మం, మధిర, వైరా, సత్తుపల్లి పట్టణాలతోపాటు మేజర్ పంచాయతీల్లోనూ జనరల్, మల్టీ స్పెషాలిటీ, పాలీ క్లినిక్‌ల పేరుతో విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. జిల్లా వైద్యారోగ్యశాఖ గణాంకాల ప్రకారమే దాదాపు 600 పైచిలుకు ప్రైవేట్ దవాఖానాలుండడం గమనార్హం. ఒక్క ఖమ్మం నగరంలోనే 300కు పైగా వివిధ రకాల పేర్లతో కొనసాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆసుపత్రుల్లో ఎన్నింటికి అనుమతులున్నాయో, ఎన్ని అక్రమంగా కొనసాగుతున్నాయో ఎవ్వరికీ అంతుచిక్కని విషయం. ఎటువంటి విద్యార్హత లేకపోయినప్పటికీ అనేకమంది యజమానులు వైద్యశాలలను ఏర్పాటు చేసి వైద్యులను నియమించుకొని ఆసుపత్రులు నడిపిస్తున్న విషయం విదితమే. అందరూ కలిసి పేద, మధ్యతరగతి, ఉన్నత వర్గాలు అనే మానవతను మరిచి చిన్నచిన్న కారణాలతో తమ వద్దకు వస్తున్న రోగులను పీల్చి పిప్పిచేస్తున్నారనేది బహిరంగ రహస్యం. మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని చిన్నపాటి రోగానికి కూడా పలు రకాల వైద్య పరీక్షలు చేయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మేజర్ సర్జరీలకు ఆస్తులమ్ముకోవాల్సిందే..**

ఇటీవల కాలంలో ఖమ్మంలో పలు రకాల విభాగాల్లో మేజర్ సర్జరీలు జరుగుతున్నాయి. కార్డియాలజీ విభాగంలో గుండెకు స్టంట్, ఫేస్ మేకర్‌తోపాటు ఓపెన్ హార్ట్ సర్జరీలు కూడా కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్నారు. మోకీలు మార్పిడి, ల్యాపరోస్కోపిక్ సర్జరీలు, కిడ్నీలకు డయాలసిస్, కిడ్నీల్లో రాళ్లు తొలగించడం వంటి అనేక కీలక సర్జరీలకు ఖమ్మం కేరాఫ్‌గా మారిందని చెప్పొచ్చు. అయితే, ఆయా రోగాలు పేదవాళ్లకు ప్రాణసంకటంగా మారితే, మధ్యతరగతి వర్గాలకు ఆస్తులమ్ముకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ వైద్యం పేరుతో ఒక్కో సర్జరీకి ఒక్కో ప్యాకేజీని ప్రకటించి గుట్టుచప్పుడు కాకుండా లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఏయే రకాల వైద్యసేవలకు ఎంత ఫీజు తీసుకుంటున్నారో బహిర్గత పరచాలి. అదేవిధంగా ఆసుపత్రులకు అనుసంధానంగా ఉండే ల్యాబ్‌లలో కూడా ధరల పట్టిక రోగులకు కనిపించేలా పెట్టాలి. కానీ, జిల్లాలో నూటికి తొంభై శాతం ఆసుపత్రుల్లో ఫీజులు, ధరల పట్టికల బోర్డులు ఎక్కడా కనిపించవు. కొందరైతే ఆన్‌లైన్ పేమెంట్‌కు సైతం అంగీకరించక, కేవలం క్యాష్ పేమెంట్ చేయాలంటూ బలవంతం చేయడం పరిపాటిగా మారింది.



# విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**- ఈపీఎఫ్‌ను రద్దు చేసి జీపీఎఫ్‌గా మార్చాలని వినతి**

**యాదగిరిగుట్ట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** 1999 నుంచి 2003 మధ్యకాలంలో నియమితులైన విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు వినతిపత్రం సమర్పించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఉద్యోగుల తరఫున కార్మికులు ఈ వినతిని అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న ఈపీఎఫ్ విధానం కారణంగా ఉద్యోగుల భవిష్యత్తు భద్రత ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. ముఖ్యంగా పదవీ విరమణ అనంతరం నిరంతర పెన్షన్ సౌకర్యం లేకపోవడంతో కార్మికులు మరియు వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని వివరించారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతున్న నేపథ్యంలో వైద్య ఖర్చులు కూడా పెరుగుతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఉద్యోగికి పెన్షన్ సౌకర్యం ఉండాల్సిందేనని కార్మికులు అభిప్రాయపడ్డారు. అందువల్ల 1999 నుంచి 2003 మధ్యకాలంలో నియమితులైన విద్యుత్ ఉద్యోగులను ఈపీఎఫ్ విధానం నుంచి జీపీఎఫ్ విధానానికి మార్చి పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కార్మికులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం వద్ద ప్రస్తావించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 1104 జిల్లా అధ్యక్షుడు పడిగం యాదగిరి, మీర్జా షకీల్ బేగ్, టి. రమేష్ రెడ్డి, బొట్ల రాజేశ్వర్, గుమ్మడి ఆంజనేయులు, బండపల్లి ఆంజనేయులు, బాబురావు, నానచర్ల నరసింహ, రాజమల్లయ్య, సత్తయ్య, ఉప్పలయ్య, కే. శ్రీనివాస్ తదితర విలేజ్ ఎలక్ట్రిసిటీ వర్కర్లు పాల్గొన్నారు.

# పరీక్ష రాసే వేళ.. విధి వక్రీకరణ!

- పరీక్షకు వెళ్తుండగా ప్రమాదం
- ఆటో ఢీకొనడంతో కుప్పకూలిన శివరాం
- పది పరీక్షలకు రాకుండానే ఆసుపత్రి పాలు



**వలిగొండ, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** జీవితంలో కీలకమైన పదో తరగతి పరీక్షలు రాయడానికి కోటి ఆశలతో బయలుదేరిన ఓ విద్యార్థిని విధి వంచించింది. పరీక్షా కేంద్రానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు. ఈ సంఘటన శనివారం వలిగొండ మండలంలోని రెడ్లరేపాక గ్రామ శివారులో చోటుచేసుకుంది. పహిల్వాన్‌పూర్ గ్రామానికి చెందిన వనగంటి శివరాం శనివారం ఉదయం తన స్కూటీపై వలిగొండలోని పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు బయలుదేరాడు. రెడ్లరేపాక గ్రామ శివారులోకి చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న ఆటో వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివరాం స్కూటీపై నుంచి కిందపడిపోవడంతో తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న 108 సిబ్బంది గాయపడిన విద్యార్థికి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏడాదంతా కష్టపడి చదివిన తమ కుమారుడు పరీక్షకు వెళ్లే రోజునే ప్రమాదానికి గురవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది.




# భారత్ రన్నరప్

హైదరాబాద్: ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ ఆసాంతం అపజయమెరుగని ఆటతో అదరగొట్టిన భారత మహిళల జట్టు ఫైనల్‌లో తడబడింది. నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన తుది పోరులో భారత్.. 0–2తో ఇంగ్లండ్ చేతిలో అపజయం పాలై రన్నరప్‌తో సరిపెట్టుకుంది. లీగ్‌తో పాటు కీలక నాకౌట్ దశలోనూ సత్తాచాటిన భారత అమ్మాయిలు.. కీలక ఫైనల్ పోరులో మాత్రం ప్రపంచ ఆరో ర్యాంకు జట్టైన ఇంగ్లండ్ ఆట ముందు తేలిపోయి ఇంగ్లండ్ తరఫున తొలి క్వార్టర్‌లోనే గ్రేస్ బల్స్‌డన్ (13వ నిమిషంలో) గోల్ కొట్టగా మూడో క్వార్టర్‌లో నీల్ ఎలిజిబెత్ (43వ నిమిషంలో) రెండో గోల్ సాధించింది. నాలుగు క్వార్టర్స్‌లోనూ భారత జట్టుకు నాలుగుసార్లు పెనాల్టీ కార్నర్‌ల ద్వారా గోల్ కొట్టే అవకాశమొచ్చినా మన అమ్మాయిలు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. మరో మ్యాచ్‌లో స్కాట్లాండ్.. 1–0తో ఇటలీని చిత్తుచేసి మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ ఏడాది ఆగస్టు 15–30 మధ్య బెల్జియం, నెదర్లాండ్స్ ఆతిథ్యమివ్వనున్న హాకీ ప్రపంచకప్‌నకు ఈ టోర్నీలో టాప్–3లో నిలిచిన జట్లు (ఇంగ్లండ్, భారత్, స్కాట్లాండ్) అర్హత సాధించాయి. టోర్నీలో ఇప్పటికే ప్రపంచకప్ బెర్త్‌ను ఖరారు చేసుకున్న భారత్.. టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగింది. కానీ ఫైనల్‌లో మాత్రం పటిష్ట ఇంగ్లండ్ సమష్టి ఆట ముందు భారత్ తేలిపోయింది. రెండో నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ అవకాశం దక్కినా నవనీత్ కౌర్ దానిని గోల్‌గా మలుచలేకపోయింది. తొలి క్వార్టర్ ముగింపు దశకు చేరుకుంటున్న సమయంలో దక్కిన పీసీని ఇంగ్లండ్ చక్కగా వినియోగించుకుని గోల్ చేసింది. ఆట అర్ధభాగం ముగిసేసరికే 1–0 ఆధిక్యంలో ఉన్న ఇంగ్లండ్.. భారత ఎదురుదాడిని నిలువరిస్తూనే 43వ నిమిషంలో రెండో గోల్‌తో ఆధిక్యాన్ని 2–0కు పెంచుకుంది. పటిష్టమైన ఇంగ్లండ్ డిఫెన్స్‌ను ఛేదించలేక ఆఖరి క్వార్టర్‌లోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. టోర్నీలో నాలుగు గోల్స్ చేసిన నవనీత్ కౌర్‌కు బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు లభించింది.

# ద్రవిడ్, మిథాలీలకు ‘లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్’





ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రతీ ఏటా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చే ఆటగాళ్లకు ఇచ్చే ‘నమన్’ అవార్డుల వివరాలను 2026 సంవత్సరానికిగాను ప్రకటించింది. భారత క్రికెట్‌కు చేసిన సేవలకుగాను అందించే కల్నల్ సీకే నాయుడు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఈ సారి ముగ్గురు క్రికెటర్లకు ప్రకటించారు. రోజర్ బిన్నీ, రాహుల్ ద్రవిడ్‌లతో పాటు భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా ఈ పురస్కారానికి ఎంపికైంది. పురుషుల విభాగంలో ఇచ్చే అత్యుత్తమ అంతర్జాతీయ క్రికెటర్ ‘పాలీ ఉమ్రీగర్ అవార్డు’ భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు దక్కింది. మహిళల విభాగంలో అత్యుత్తమ అంతర్జాతీయ క్రికెటర్ పురస్కారం స్మృతి మంధాన గెలుచుకుంది. ఆమె కెరీర్‌లో ఈ అవార్డు సాధించడం ఐదో సారి కావడం విశేషం. నేడు (ఆదివారం) న్యూఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్య క్రమంలో ఈ అవార్డులను అందజేస్తారు.

**యువ క్రీడాకారులకూ...**

వర్ధమాన క్రికెటర్లకు ప్రోత్సాహకాన్ని అందించే ఇతర అవార్డులను కూడా బోర్డు ప్రకటించింది. దేశవాళీ మహిళల క్రికెట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చే ప్లేయర్లకు ఇచ్చే ‘జగ్మోహన్ దాల్మి యా’ అవార్డును ఇద్దరు ప్లేయర్ అందుకోనున్నారు. ముంబైకి చెందిన ఇరా జాదవ్, హరియాణా ప్లేయర్ షఫాలీ వర్మలకు ఈ అవార్డు దక్కింది. పురుషుల విభాగంలో దేశవాళీ క్రికెట్‌లో అత్యుత్తమ ఆల్‌రౌండర్ ‘లాలా అమర్‌నాథ్’ అవార్డు పరిమిత ఓవర్ల టోర్నీల్లో ఆయుశ్ మాత్రేకు, రంజీ ట్రోఫీలో ప్రదర్శనకుగాను హర్ష్ దూబేకు దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో సీజన్‌లో నాలుగు ట్రోఫీలు గెలుచుకోవడంతో పాటు రెండు టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచిన ముంబై జట్టుకు ఉత్తమ క్రికెట్ అసోసియేషన్ అవార్డు లభించింది.

**ఐదు టీమ్‌లకు సత్కారం...**

‘నమన్’ అవార్డుల వేడుకలో భాగంగా గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీసీఐ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని జత చేసింది. ఇటీవల ఐదు వేర్వేరు అంతర్జాతీయ క్రికెట్ టోర్నీ (ఐసీసీ) ట్రోఫీలు గెలిచిన భారత జట్లను ఒకేసారి ప్రత్యేకంగా సన్మానించనుంది. పురుషుల విభాగంలో 2025 చాంపియన్స్ ట్రోఫీ, 2026 టి20 వరల్డ్ కప్ గెలిచిన టీమ్‌లు... మహిళల విభాగంలో 2025 వన్డే వరల్డ్ కప్ సాధించిన టీమ్... అండర్19 స్థాయిలో పురుషుల వరల్డ్ కప్ 2026, మహిళల వరల్డ్ కప్ 2025 గెలిచిన టీమ్‌లను సత్కారం దక్కనుంది.

రోజర్ బిన్నీ: 1983 వరల్డ్ కప్‌లో అత్యధిక వికెట్లు తీసి భారత జట్టు చారిత్రాత్మక విజయంలో బిన్నీ కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత 1985 వరల్డ్ చాంపియన్‌షిప్ గెలిచిన జట్టులో కూడా బిన్నీ సభ్యులు. ఆల్‌రౌండర్‌గా భారత్ తరఫున 27 టెస్టులు, 72 వన్డేలు ఆడిన బిన్నీ రెండు ఫార్మాట్‌లలో కలిపి 1459 పరుగులు చేసి 124 వికెట్లు పడగొట్టారు. 2000లో అండర్19 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టుకు కోచ్‌గా ఉన్న బిన్నీ ఆ తర్వాత నాలుగేళ్ల పాటు సెలక్టర్‌గా, 202225 మధ్య బీసీసీఐ అధ్యక్షుడిగా వ్యవహరించారు.

రాహుల్ ద్రవిడ్: బ్యాటింగ్‌లో అసాధారణ సాంకేతిక నైపుణ్యం, పదునైన డిఫెన్స్‌తో భారత క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా ద్రవిడ్ గుర్తింపు పొందాడు. 164 టెస్టుల్లో 13,288 పరుగులు, 344 వన్డేల్లో 10,889 పరుగులు చేసిన ఘనత ద్రవిడ్ సొంతం. ద్రవిడ్ కోచ్‌గా ఉన్న భారత అండర్19 జట్టు 2018లో వరల్డ్ కప్ గెలుచుకోగా ... అతని కోచింగ్‌లో 2024లో భారత సీనియర్ టీమ్ టి20 వరల్డ్ కప్‌ను సొంతం చేసుకుంది.

# ఆధునిక టెక్నాలజీతో న్యూ హాలండ్ ట్రాక్టర్లు

- చౌటుప్పల్‌లో నూతన న్యూ హాలండ్ ట్రాక్టర్ షోరూమ్ ప్రారంభం
- కంపెనీ డైరెక్టర్లు లక్ష్మణ్, సంతోషి




**చౌటుప్పల్, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** ఆధునిక సాంకేతికతతో రూపొందించిన న్యూ హాలండ్ ట్రాక్టర్లను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామని కంపెనీ డైరెక్టర్లు లక్ష్మణ్, సంతోషి తెలిపారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పక్కన లాక్సస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ హాలండ్ ట్రాక్టర్ షోరూమ్‌ను శనివారం వారు ప్రారంభించారు. షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా నూతన ట్రాక్టర్‌ను కొనుగోలు చేసిన రైతుకు డైరెక్టర్లు లక్ష్మణ్, సంతోషిలు తమ చేతుల మీదుగా ట్రాక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోనే అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో వ్యవసాయ యంత్రాలను తయారు చేసే సంస్థగా న్యూ హాలండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. న్యూ హాలండ్ ట్రాక్టర్లు 30 హెచ్‌పీ నుంచి 150 హెచ్‌పీ సామర్థ్యంతో అందుబాటులో ఉన్నాయని, అన్ని రకాల వ్యవసాయ పనులకు అనువైన ఇంప్లిమెంట్లతో రూపొందించామని తెలిపారు. మెరుగైన పనితీరు, ఇంధన సామర్థ్యం మరియు విశ్వసనీయత ఈ ట్రాక్టర్ల ప్రత్యేకతలని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో రైతులకు ఉపయోగపడే విధంగా ఆధునిక సాంకేతికతతో వీటిని రూపొందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.








# అంగరంగ వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**చౌటుప్పల్, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో ఉన్న శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఈ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 8 గంటలకు గణపతి పూజ, అనంతరం ఉదయం 8.30 గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామివారికి విశేష పంచామృత అభిషేకం, సహస్రనామ పుష్పార్చన నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణం, హోమ కార్యక్రమాలు జరిపారు. మధ్యాహ్నం 1 గంటకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు నాగిళ్ల రామచంద్రం, ఉపాధ్యక్షులు చింతల ప్రభాకర్ రెడ్డి, ఊదరి శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి ఊదరి శంకర్, కోశాధికారి ఎలక రాజునాగరాజు (మల్లేష్), సహాయ కార్యదర్శి ఉష్కాగుల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి తూర్పునూరి నరసింహ గౌడ్, ఆరుట్ల లింగస్వామి, సంస్కృతిక కార్యదర్శులు తూర్పునూరి మల్లేష్ గౌడ్, గట్టు పవన్, కార్యవర్గ సభ్యులు నకిరేకంటి శ్రీశైలం, ఊదరి మారయ్య, ఊదరి యాదయ్య, చెవగొని మహేష్, జక్కర్తి శేఖర్, నల్ల పర్వతాలు, ఉయ్యాల పల్లవి, గంగిరెడ్డి నాగలక్ష్మి, గౌరవ సలహాదారులు చింతల దామోదర్ రెడ్డి, బత్తుల శ్రీశైలం గౌడ్, మంచికంటి భాస్కర్ గుప్తా, గుజ్జల సురేందర్ రెడ్డి, అన్నెమోని గోవిందరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు బత్తుల విప్లవ గౌడ్, కాసుల వెంకటేష్, బాల్యం వెంకటాచలపతి, నల్ల గణేష్ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సంతోష్ కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



# నర్సరీ పనుల పర్యవేక్షణ

**- 99 రోజుల కార్యాచరణలో భాగంగా అధికారుల తనిఖీ**



**రామన్నపేట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులు వేగంగా కొనసాగుతున్నాయి. శనివారం మండల పర్యవేక్షణ అధికారి ఎండీ రావూఫ్ అలీ గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మొక్కల ఎదుగుదల, నీటి సౌకర్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి ప్రగతి ప్రణాళిక ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రసూల్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల, ఎండీ అమినోద్దీన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# వీడిన 'న్యాయ' బాంధవుడు..

- మారపాక వెంకన్నకు కన్నీటి వీడ్కోలు
- పార్థివ దేహంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన ఐలు నేతలు



**రామన్నపేట/సూర్యాపేట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) సూర్యాపేట జిల్లా కార్యదర్శి మారపాక వెంకన్న అకాల మరణం న్యాయవాద లోకానికి తీరని లోటని ఆ సంఘం నేతలు పేర్కొన్నారు. ఆదివారం వెంకన్న పార్థివ దేహాన్ని పలువురు న్యాయవాదులు, రాజకీయ నేతలు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదుల హక్కుల కోసం, సామాజిక సమస్యల పరిష్కారం కోసం వెంకన్న చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ నివాళులర్పించిన వారిలో ఐలు సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఏ రంగారావు, నల్గొండ జిల్లా కార్యదర్శి అనంత శంకరయ్య, యాదాద్రి జిల్లా నాయకులు యాదసు యాదయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొంపెల్లి లింగయ్య, మాజీ అధ్యక్షులు నూకల సుదర్శన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్ట కొండ సత్యనారాయణ, కెవిఎస్ రాష్ట్ర నాయకులు కోట గోపి, కంచర్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిని పొదుపుగా వాడుకుందాం..
# భూగర్భ జలాలను రక్షించుకుందాం

**- వర్షాలు కురిశాయని వృథా చేయొద్దు**
**- సాగు, తాగునీటిపై జాగ్రత్తలు తప్పనిసరి**
**- రిటైర్డ్ ఈఈ బొడ్డు సురేందర్ రావు**



**రామన్నపేట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** వేసవి కాలం దృష్ట్యా సాగు నీరు, తాగునీటిని ప్రతి ఒక్కరూ అత్యంత పొదుపుగా వినియోగించాలని నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బొడ్డు సురేందర్ రావు సూచించారు. శనివారం రామన్నపేట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నీటి సంరక్షణపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. గత వర్షాకాలంలో కురిసిన వర్షాల వల్ల భూగర్భ జలాలు కొంత మేర పెరిగినప్పటికీ వాటిని ఇష్టానుసారంగా వినియోగిస్తే వేసవిలో తీవ్ర నీటి కొరత తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల నీటిని జాగ్రత్తగా ఉపయోగిస్తూ భూగర్భ జలాలను కాపాడుకోవాలని సూచించారు. ఇళ్లలో నల్లాల ద్వారా వచ్చే నీటిని అవసరం లేకుండా మురికికాలువల్లోకి వృథాగా వదలరాదని, అవసరం తీరిన వెంటనే నల్లాలు మూసివేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే రైతులు పొలాలకు మోటార్లు వేసినప్పుడు పంటలకు తగినంత తడి అందగానే మోటార్లు నిలిపివేయాలని తెలిపారు. అదేపనిగా నీటిని పారించడం వల్ల భూగర్భ జలాలు త్వరగా తగ్గిపోతాయని పేర్కొన్నారు. కలుషిత నీరు సేవించడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ప్రజలు ఎల్లప్పుడూ సురక్షితమైన నీటినే తాగాలని సూచించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ సూచనలను పాటించాలని తెలిపారు.

# రాజీ మార్గమే రాజమార్గం..

- 28న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి!
- రామన్నపేటలో లోక్ అదాలత్ సమన్వయ సమావేశం
- పోలీసు యంత్రాంగం, న్యాయవాదులకు దిశానిర్దేశం
- సమన్వయ సమావేశంలో న్యాయమూర్తులు



**రామన్నపేట, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తులు పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గౌరవ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు సూచనల మేరకు రామన్నపేటలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్‌లో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యాదాద్రి భువనగిరి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ గౌరవ కార్యదర్శి వి. మాధవి లత, మండల న్యాయ సేవా సమితి చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష, రెండవ తరగతి మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి. సత్తయ్య హాజరయ్యారు. అదేవిధంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపీపీ నిజాముద్దీన్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎస్. శ్రవణ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ. మజీద్, బార్ సభ్యులు, ప్యానల్ అడ్వకేట్లు ఎం. వెంకట్ రెడ్డి, బి. డేవిడ్ పాల్గొన్నారు. పోలీసు విభాగం నుంచి రామన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, మోత్కూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి. వెంకటేశ్వర్లు, వలిగొండ సబ్ ఇన్‌స్పెక్టర్ వి. యుగేందర్, అడ్డగూడూరు సబ్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకట్ రెడ్డి, రామన్నపేట ఏఎస్ఐ సురేందర్, రామన్నపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శివకృష్ణ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, పెండింగ్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించే విధానాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ కేసులను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని న్యాయమూర్తులు సూచించారు. లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా న్యాయవాదులు, పోలీసు యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని కోరారు. రాజీకి అవకాశం ఉన్న కేసుల కక్షిదారులకు ముందస్తుగా లోక్ అదాలత్ నోటీసులు అందజేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అలాగే రామన్నపేట కోర్టు పరిధిలోని గ్రామాల వరకు లోక్ అదాలత్ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ వరకు ప్రతిరోజూ కోర్టు ప్రాంగణంలో ప్రీ-సిట్టింగ్స్ నిర్వహిస్తామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తులు తెలిపారు.



# గృహ సిలిండర్లకు వాణిజ్య సెగ!




### తక్షణమే తనిఖీలు చేపట్టాలి:

అధికారులు స్పందించి మండల కేంద్రంలోని స్క్రాప్, వెల్డింగ్ షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా డొమెస్టిక్ సిలిండర్లను విక్రయిస్తున్న ఏజెన్సీలు, వాడుతున్న వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అక్రమ దందాను అరికట్టాలని విన్నవిస్తున్నారు.

### కృత్రిమ కొరతకు కారణం..

ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల వల్ల గ్యాస్ సరఫరాలో అంతర్జాతీయంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సామాన్య వినియోగదారులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని సిలిండర్ల కోసం పడిగాపులు కాస్తుంటే, మరోవైపు గ్యాస్ ఏజెన్సీల నుంచి డొమెస్టిక్ సిలిండర్లు నేరుగా స్క్రాప్ షాపులకు ఎలా వెళుతున్నాయని ప్రజలు నిలదీస్తున్నారు. ఇలాంటి అక్రమ మళ్లింపు వల్లే మార్కెట్లో గ్యాస్ కొరత ఏర్పడుతోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వలిగొండలో యథేచ్ఛగా అక్రమ వినియోగం..
- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ
- స్క్రాప్ షాపుల్లో గ్యాస్ కట్టర్ల జోరు..
- ప్రాణభయంలో స్థానిక కాలనీ వాసులు

**సామాన్యులకు కేటాయించిన రాయితీ గ్యాస్ సిలిండర్లు వలిగొండలో అక్రమంగా వ్యాపార సంస్థలకు మళ్లుతున్నాయి. గృహ వినియోగానికి మాత్రమే వాడాల్సిన డొమెస్టిక్ సిలిండర్లను మండల కేంద్రంలోని పలు స్క్రాప్ కటింగ్, వెల్డింగ్ షాపుల్లో యథేచ్ఛగా ఉపయోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం వాణిజ్య (కమర్షియల్) సిలిండర్లు వాడాల్సి ఉండగా, తక్కువ ధరకు దొరుకుతున్నాయనే సాకుతో వ్యాపారస్తులు డొమెస్టిక్ సిలిండర్లను వాడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.**

**వలిగొండ, మార్చి 14: (తొలివెలుగు న్యూస్):**

### అధికారుల ముందే అక్రమ దందా:

మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న జంగాల కాలనీ ప్రాంతంలో ఈ అక్రమ వినియోగం మితిమీరిపోతోంది. పలు స్క్రాప్ షాపుల్లో బహిరంగంగానే డొమెస్టిక్ సిలిండర్ల సాయంతో ఇనుమును కట్ చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలోనే ఈ తంతు సాగుతున్నా, పౌరసరఫరాల శాఖ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




### పేలుడు సంభవిస్తే బాధ్యులెవరు?

స్క్రాప్ కటింగ్ షాపుల్లో రక్షణ చర్యలు లేకుండా గ్యాస్ వాడటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. "స్క్రాప్ షాపుల పక్కన నివసించడమే భయంగా ఉంది. పొరపాటున సిలిండర్ పేలితే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా ఈ గ్యాస్ కటింగ్ వల్ల వెలువడే కాలుష్యంతో చిన్న పిల్లలకు, వృద్ధులకు శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి" అని జంగాల కాలనీ వాసులు వాపోతున్నారు.

# రహదారిపై బోర్డులు పెడితే కఠిన చర్యలు

**- ఆలేరులో ఆక్రమణల తొలగింపు..**
**- ట్రాఫిక్ ఇబ్బందులపై అధికారుల నిఘా**
**- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి**




**ఆలేరు, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** పట్టణంలోని ప్రధాన రహదారులపై రాకపోకలకు ఆటంకం కలిగించేలా బోర్డులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆలేరు మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాల ముందు ఏర్పాటు చేసిన బోర్డులను ఆయన స్వయంగా పరిశీలించారు. వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా మారిన పలు బోర్డులను మున్సిపల్ సిబ్బందితో కలిసి తొలగింపజేశారు. రహదారులపై అనధికారంగా ఏర్పాటు చేసిన బోర్డులు ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్నాయని కమిషనర్ తెలిపారు. మున్సిపల్ నిబంధనలను అతిక్రమించి రోడ్లపైకి బోర్డులు ఏర్పాటు చేయవద్దని, పట్టణ సుందరీకరణకు, ట్రాఫిక్ నియంత్రణకు షాపుల యజమానులు సహకరించాలని కోరారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ రోడ్లపై ఆక్రమణలు లేకుండా చూడాలని శానిటేషన్ సిబ్బందికి కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే. శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ బి. జగన్ మోహన్, శానిటేషన్ సూపర్‌వైజర్లు పి. ప్రసాద్, ఏ. శివతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు

- వినియోగదారులు ఆందోళన చెందవద్దు
- తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు: జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి, మార్చి 14 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లాలో గృహ వినియోగానికి ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో వినియోగదారులు ఎటువంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని, తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు. జిల్లాలో గృహ వినియోగానికి అవసరమైన ఎల్పీజీ గ్యాస్ సరఫరా సాధారణంగా కొనసాగుతోందని, గ్యాస్ ఏజెన్సీల ద్వారా సిలిండర్ల పంపిణీ నిరంతరంగా జరుగుతోందని పేర్కొన్నారు. ఎక్కడైనా సిలిండర్ల కొరత ఉన్నట్లు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో అవసరమైనంత గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అనవసరంగా ఎక్కువ సిలిండర్లు బుక్ చేసుకోవడం లేదా నిల్వ చేసుకోవడం చేయవద్దని కోరారు. ప్రభుత్వం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. అలాగే ఆసుపత్రులు, రెసిడెన్షియల్ హాస్టళ్లు, విద్యాసంస్థల్లో కూడా ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు.